సాక్షి
కాకినాడ
మంగళవారం । 12 । ఆగస్టు । 2025



కలుపు ఉంటే.. కలదు నష్టం

వరి సాగులో రైతులకు కలుపుతీత ప్రధాన మైంది. సకాలంలో కలుపుతీత తీయడం ద్వారా నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు సాధించవచ్చు.


8 లో



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

చోరీలు, చైన్‌స్నాచింగ్‌తో పాటు, అనేక నేరాలకు పాల్పడిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 1,18,431 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. గోదావరి డెల్టాకు 13,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో మత కార్యకలాపాలపై నిషేధం

అధికారులు, సిబ్బందికి సర్క్యులర్ జారీ

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో ఎప్పటికప్పుడు తీవ్ర వివాదాలకు కారణమవుతున్న మత కార్యకలాపాలపై నిషేధాన్ని విధిస్తూ కలెక్టర్ షణ్మోహన్ సూచనలతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆర్‌సీ. నం.18/ఏవో/2025తో సర్క్యులర్ జారీ చేశారు. అంతకుముందు హెడ్ నర్సులు, ఆసుపత్రి అధికారులతో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో అంతర్గత సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ సూత్రాలకు లోబడి లౌకిక వాదం అనుసరించాల్సిన ఆసుపత్రి, ఆవరణలో, తటస్థత, సమగ్రత తప్పనిసరి అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వార్డులు, కార్యాలయాలతో పాటు ఆసుపత్రి సంబంధిత ఇతర ప్రాంతాలలో మతపరమైన కార్యకలాపాలు అంటే పూజలు, ప్రార్థనలు, ఉత్సవాలు, సమావేశాలు, ఊరేగింపులు, ప్రచారాలు, బోధనలు నిర్వహించడం, ప్రోత్సహించడం, వాటిలో పాల్గొనడం పూర్తిగా నిషేధం. మత సంబంధిత పుస్తకాలు, కరపత్రాలు, బ్యానర్లు, చిత్రాలు, వాల్ పోస్టర్లు చూపడం, పంచడం చేయకూడదు. ఈ ఆదేశాలు ఆసుపత్రి సిబ్బంది, అధికారులు, మెడికల్, పారామెడికల్, అడ్మినిస్ట్రేటివ్, సహాయక, అనుబంధ విభాగాలలో పనిచేస్తున్న వారితోపాటు ఆసుపత్రిలోకి ప్రవేశించే ఇతరులకూ వర్తిస్తాయి. ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

ఎయిడ్స్ నియంత్రణ పోస్టర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ, ఎయిడ్స్ అనుసంధానంతో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ ప్రోగ్రామ్స్ పోస్టర్‌ను కలెక్టర్ షణ్మోహన్ సగిలి సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. హైరిస్క్ మండలాల్లోని గ్రామాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి నివారణ, ఉన్న అపోహలు తొలగించినందుకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వివరించారు. హెచ్ఐవి జీవిస్తున్న వారికి మందులు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నామన్నారు. యువతలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కలిగించేందుకు జిల్లాలో ఉన్న కాలేజీల్లో, హైస్కూళ్లలో రెడ్ రిబ్బన్ క్లబ్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ 1097 టోల్‌ఫ్రీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. జేసీ రాహుల్ మీనా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జె.నరసింహనాయక్, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి ఐ ప్రభాకరరావు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి బాలాజీ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 441 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మానీషా, జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసు, సీపీవో పి త్రినాథ్‌లతో కలిసి హాజరై ప్రజల నుంచిఅర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలపై విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్ల మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, రీ సర్వే, ఆక్రమణల తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, తల్లికి వందనం ఆన్‌లైన్ సమస్యలు వంటి అంశాలకు చెందిన మొత్తం 441 అర్జీలు అందాయి.

పారదర్శకంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ పారదర్శకంగా జరుగుతుందని విశాఖ ఆర్మీ విభాగం సోమవారం ఒక ప్రకటలో తెలిపింది. విశాఖ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ర్యాలీలో అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. ఈనెల 5 న ప్రారంభమైన ఈ ర్యాలీ 21 వరకు కొనసాగుతుందన్నారు. అగ్రివీర్ విభాగాల్లో స్టోర్ కీపర్, టెక్నికల్ క్లర్క్, జనరల్ డ్యూటీ, ట్రేడ్స్ మెన్ విభాగాలకు ఈ రిక్రూట్‌మెంట్‌ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్, లోకల్ ఆర్మీ అధికారుల పర్యవేక్షణలో మెరిట్ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు.



ఆర్ఎంసీ క్రీడాప్రాంగణం ముఖద్వారం

ఆర్ఎంసీ క్రీడాప్రాంగణం



రంగస్థలంపై సానా పంతం!

- రంగరాయ వైద్య కళాశాల గ్రౌండ్‌పై పెత్తనం వెనుక దూరాలోచన
- ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు
- గ్రౌండ్‌లో వాకర్స్‌కు అనుమతిపై పలువురి ఆక్షేపణ
- ఇద్దరు ఎమ్మెల్యేల గైర్హాజరుపై చర్చ



రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు



జనసేన ఎమ్మెల్యే నానాజీ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రంగరాయ వైద్య కళాశాల గ్రౌండ్‌లో కూటమి నేతలు రాజకీయ కుస్తీలకు సై అంటున్నారు. ఆరు దశాబ్దాల పైబడి చరిత్ర కలిగిన రంగరాయ వైద్యకళాశాలకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. అందుకే దేశంలోని పలు రాష్ట్రాల విద్యార్థులు ఆర్ఎంసీలో సీటు వచ్చిందంటే చాలా సంబర పడతారు. ఎంబీబీఎస్, పీజీ, పారా మెడికల్ కోర్సులు కలిపి సుమారు 2,000 మంది విద్యార్థులకు సరస్వతి నిలయంగా ఆర్ఎంసీ విరాజిల్లుతోంది. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఆర్ఎంసీని కూటమి నేతలు రాజకీయ వేదికగా మార్చేశారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆధిపత్యం కోసం ఆర్ఎంసీని పావుగా వాడుకుంటున్నారని మెడికోలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎంసీలో విద్యార్థుల కోసం ఉన్న 14 ఎకరాల విశాలమైన ఆటస్థలంలో బయటి వ్యక్తులను వాకింగ్ ట్రాక్ కోసం అనుమతించడంపై కూటమి నేతల మధ్య వార్ నడుస్తోంది.

వాకర్స్‌కు మళ్లీ అనుమతిపై వ్యతిరేకత

ఆర్ఎంసీలోని అన్ని విభాగాలకు చెందిన వైద్య విద్యార్థుల కోసం ఏర్పాటైన ఈ గ్రౌండ్‌లో బయట వ్యక్తులు చొరబడి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఆ గ్రౌండ్‌లో ఆటలాడుకునే వైద్య విద్యార్థినులకు రౌడీమూకల నుంచి వేధింపులు ఎక్కువవ్వడంతో మెడికోలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బయట వారిని అనుమతించవద్దని విద్యార్థుల డిమాండ్‌పై కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ అనుచరులను వెంటేసుకుని గ్రౌండ్‌కు వెళ్లి నానా రాద్ధాంతం చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఎమ్మెల్యే నానాజీ ఆర్ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌చార్జి, ఫోరెన్సిక్ హెచ్ఓడీ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై చేయిచేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనమైంది. అప్పట్లో కూటమి పెద్దలు జోక్యం చేసుకుని జిల్లా అధికారుల ద్వారా ఒత్తిడి తీసుకువచ్చి నానాజీతో డాక్టర్ ఉమామహేశ్వరరావుకు క్షమాపణ చెప్పడంతో సమస్యను సర్దుబాటు చేయడం తెలిసిందే. ఇంత రాద్ధాంతం జరిగినా రెండురోజుల క్రితం ఆర్ఎంసీ గ్రౌండ్స్‌లో వాకర్స్‌ను కొన్ని షరతులకు లోబడి తిరిగి అనుమతించడాన్ని దాదాపు అన్ని వర్గాలు ఆక్షేపిస్తున్నాయి. అదీ కూడా అధికారాన్ని ఉపయోగించి ఉన్నత స్థాయి నుంచి జిల్లా యంత్రాంగం, ఆర్ఎంసీ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి మరీ అనుకున్నది సాధించుకున్నారు.



ఆర్ఎంసీ గ్రౌండ్‌లో వాకర్స్‌కు అనుమతించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సతీష్‌బాబు

పొరుగువారు హాజరు.. ఇరుగు వారే రాలేదు!

జనసేన ఎమ్మెల్యే నానాజీతో పాటు టీడీపీ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కూడా ఈ కార్యక్రమానికి దూరంగానే ఉన్నారు. వాస్తవానికి సిటీ ఎమ్మెల్యే వనమాడి సార్వత్రిక ఎన్నికల ముందు నుంచి సతీష్‌తో ఉప్పు, నిప్పుగా ఉంటున్నారు. ఎన్నికల ముందు నుంచి ఏ పార్టీలో చేరకుండా స్వచ్ఛంద సంస్థ పేరుతో కాకినాడ సిటీలో కార్యక్రమాలు చేస్తూ, తన వర్గీయులతో టచ్‌లో ఉంటున్నారనే సమాచారం తెలియడంతో కొండబాబుకు సతీష్ పొడ గిట్టలేదు. సిటీ నియోజకవర్గ పరిధిలో లేకున్నప్పటికీ ఆర్ఎంసీ గ్రౌండ్ సిటీ, రూరల్ రెండు నియోజకవర్గాలకే పరిమితం కాదనేది వాస్తవం. పొరుగున ఉన్న పిఠాపురం నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌వర్మ హాజరవ్వడం, ఇరుగు,పొరుగున ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలు నానాజీ, కొండబాబు పునఃప్రారంభోత్సవానికి హాజరుకాకపోవడంపై కూటమిలో విస్తృతమైన చర్చ నడుస్తోంది. ఎంత మంది వద్దన్నా లెక్క చేయకుండా రంగరాయ వైద్య కళాశాల గ్రౌండ్‌లో వాకర్స్‌కు బలవంతంగా అనుమతివ్వడమే పెద్ద తప్పు. అటువంటి గ్రౌండ్‌పై ఆధిపత్యం కోసం నిస్సిగ్గుగా ఇప్పుడు కూటమి నేతలు కుమ్ములాడుకోవడంపై మేధావి వర్గం విస్మయం వ్యక్తం చేస్తోంది.

ఎంపీ, ఎమ్మెల్యే మధ్య వైరుధ్యాలు?

గ్రౌండ్స్‌లో వాకర్స్‌ను అనుమతించే వరకు పట్టువదలని విక్రమార్కులు మాదిరి కలిసి పనిచేసిన జనసేన ఎమ్మెల్యే నానాజీ, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మధ్య వైరుధ్యాలు పొడచూపాయని కూటమి నేతల మధ్య చర్చ నడుస్తోంది. గ్రౌండ్‌లో వాకర్స్‌కు అనుమతి సాధించడం వెనుక కృషి, క్రెడిట్ తమ నేతదంటే తమ నేతదంటూ పంతం, సతీష్ వర్గాలు ప్రచారం చేసుకుంటున్నాయి. గ్రౌండ్‌లో వాకర్స్‌ను అనుమతించక పోవడంపై ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావుపై దాడికి పాల్పడిన ఉదంతంతో రాష్ట్ర స్థాయిలో తమ నాయకుడు అప్రతిష్టపాలయ్యారని నానాజీ వర్గీయులు పేర్కొంటున్నారు. తమ నాయకుడు పట్టుబట్టి సాధిస్తే మధ్యలో వచ్చి ఆ క్రెడిట్‌ను ఎంపీ సతీష్ బాబు ఎగరేసుకుపోయారని నానాజీ వర్గం మండిపడుతోంది. ఆర్ఎంసీ గ్రౌండ్స్‌పై ఆధిపత్యం కోసం అంతలా సతీష్‌బాబు తాపత్రయపడటం వెనుక దూరదృష్టి లేకపోలేదంటున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లను క్రికెట్ అభిమానులు తిలకించేందుకు ఫ్యాన్‌పార్క్‌లు ఇప్పటి వరకు మెట్రోపాలిటిన్ సిటీల్లో మాత్రమే అనుమతించే వారు. అటువంటిది కాకినాడ సిటీలో తొలిసారి సతీష్ తీసుకురావడం ముందస్తు వ్యూహంలో భాగమేనంటున్నారు. అందునా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా (ఈ నెల 16న జరగనున్న ఎన్నికలకు సతీష్‌బాబు ఒక్కరే నామినేషన్ వేశారు) ఏకగ్రీవం కానున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ (బోర్డు ఆఫ్ క్రికెట్ కంట్రోల్ ఆఫ్ ఇండియా) నుంచి దండిగా నిధులు వచ్చే అవకాశం ఉంది. అలాగే జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు వార్షిక నిర్వహణ నిధులు రెట్టింపు చేయడం వంటి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇవన్నీ ఉండబట్టే ఆర్ఎంసీ గ్రౌండ్స్‌పై ఆధిపత్య పోరులో సతీష్‌బాబు ముందున్నారని నానాజీ వర్గీయులు అభిప్రాయపడుతున్నారు. 'వ్రతం చెడినా ఫలం దక్కకే' వాకర్స్‌ను అనుమతించే కార్యక్రమ పునఃప్రారంభోత్సవానికి తమ నేత డుమ్మా కొట్టారని ఆ వర్గం పేర్కొంటోంది.

రూ.1.50 లక్షల వెండి కిరీటం సమర్పణ



వెండి కిరీటానికి పూజలు చేస్తున్న దాతలు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న పార్వతీ వీరేశ్వర స్వామివారికి దాతలు వెండి కిరీటం, ఆభరణాలను సోమవారం సమర్పించారు. గంగలకుర్రుకు చెందిన తనికెళ్ల సోమసూర్య సుబ్రహ్మణ్య విశ్వేశ్వరరావు కుమారులు వెంకటసత్య సూర్యనాగభూషణం, లక్ష్మీసూర్యపద్మ దంపతులు, తనికెళ్ల రామలక్ష్మి నరసింహమూర్తి, పద్మావతి దంపతులు, మనవలు దుర్గావిశ్వనాథం, మనవరాలు ఉమాభాను రూ.1.50 లక్షలతో తయారు చేయించిన వెండి కిరీటం, ఆభరణాలను పార్వతీ వీరేశ్వర స్వామి వారికి సమర్పించారు. అంతకుముందు వెండి వస్తువులను ఆలయ ప్రధానార్చకులు చంద్రమౌ శీ సూర్యకామేష్ ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ నిర్వహించి, స్వామివార్లకు అలంకరించారు.

స్వామీ... నీ దయ రాదా!

- సత్యదేవుని సన్నిధిన శానిటరీ సిబ్బంది ఆకలి కేకలు
- అందని జూన్, జూలై జీతాలు
- నెలకు రూ.59 లక్షల చొప్పున 350 మంది సిబ్బందికి బకాయి

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపు సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. జూన్, జూలై నెలల జీతాలు ఇంకా అందకపోవడంతో 350 మంది ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా ఎక్కువ మొత్తాలలో జీతాలు తీసుకునే వేతన జీవులకే ఒక నెల జీతం ఆలస్యం అయితే ఇబ్బంది పడతారు. ఈ ఎంఐలు, అద్దెలు, వివిధ చెల్లింపులు ఆలస్యం అవుతాయి. అటువంటిది చిన్నపాటి జీతం రెండు నెలలు నుంచి రాకపోతే వారి పరిస్థితి ఏమిటో ఊహించొచ్చు.

ఐదు నెలలుగా ఇదే తంతు

ఐదు నెలలుగా జీతాలు ఆలస్యం అవుతున్నాయి. పాత కాంట్రాక్ట్ సంస్థ కేఎల్‌టీఎస్ కాలపరిమితి ముగిసిన తరువాత మార్చి నెల నుంచి శానిటరీ కాంట్రాక్ట్ విజయవాడకు చెందిన కనకదుర్గా మేన్‌పవర్ సంస్థకు అప్పగించారు. మార్చి జీతాలు ఆలస్యమవడంతో అప్పట్లో సాక్షి దినపత్రికలో ఏప్రిల్ 25వ తేదీన 'మాకు జీతాలు ఎప్పుడిస్తారు స్వామీ...?' అంటూ వార్త ప్రచురితమవడంతో ఏప్రిల్ 30న అకౌంట్‌లో జీతాలు వేశారు. ఏప్రిల్ జీతాలు కూడా పడకపోవడంతో సాక్షి దినపత్రికలో మే నెల 26న 'వీరి కష్టం తుడిచే వారేరీ!' శీర్షికన కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించి జీతాలు చెల్లించారు. మే నెల జీతాలు కూడా జూన్ రెండో వారంలో చెల్లించారు. జూలై నెలలో ఫేక్ పీఎఫ్ చలానాలు ఇచ్చారంటూ వివాదం రావడంతో ఆ చలానాలు వెరిఫై చేయడం, పీఎఫ్ కార్యాలయ సిబ్బంది తనిఖీలు, కాంట్రాక్టర్‌పై కేసులు, ఇద్దరి ఉద్యోగుల సస్పెన్షన్ వంటి పరిణామాలతో జూన్, జూలై జీతాలు ఇంకా చెల్లించలేదు.

సెక్యూరిటీ కాంట్రాక్టర్‌తో జీతాలిప్పించే ప్రయత్నం విఫలం

ఫేక్ పీఎఫ్ చలానాల ఆరోపణలతో కనకదుర్గ సంస్థను పక్కన పెట్టి సెక్యూరిటీ కాంట్రాక్ట్ సంస్థ 'మాక్స్' ద్వారా శానిటరీ సిబ్బందికి జీతాలిప్పించేందుకు కమిషనర్ కార్యాలయానికి ఫైలు పంపారు. దీనిపై కమిషనర్ అభ్యంతరం తెలిపారు. దీంతో మళ్లీ కనకదుర్గా సంస్థ ద్వారా జూన్, జూలై నెలలకు జీతాలిచ్చేందుకు వీలుగా ఆ సంస్థతో రెండు నెలల పీఎఫ్ కట్టించారు. రూ.30 లక్షల పీఎఫ్ సొమ్ము చెల్లించి ఆ రశీదులు దేవస్థానానికి ఆ సంస్థ ప్రతినిధులు జమ చేశారు. ఇది జరిగి వారం అయినా ఇంకా శానిటరీ సిబ్బంది అకౌంట్లలో జీతాలు పడలేదు.

నెరవేరని కమిషనర్ హామీ

ఈ నెల ఒకటో తేదీన అన్నవరం దేవస్థానానికి వచ్చిన దేవదాయశాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్‌ను శానిటేరి సిబ్బంది కలిసి తమ జీతాలు చెల్లింపుపై వినతి పత్రం సమర్పించారు. రెండు, మూడు రోజుల్లో జీతాలు చెల్లించే ఏర్పాటు చేయిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. నెలకు రూ.59 లక్షల చొప్పున 350 మంది సిబ్బందికి రెండు నెలల జీతాలు చెల్లించాల్సి ఉంది. అయినా 11వ తేదీ వచ్చినా జీతాలు చేతికి అందడం కాదు కదా ఇంకా జీతాల బిల్లు సిద్ధం కాలేదని తెలిసింది.

మరో వారం పడుతుందా?

జీతాలు బిల్లు తయారైతే అది ఆడిట్‌కు వెళ్లి అక్కడ ఏ కొర్రీలు పడకుండా మళ్లీ దేవస్థానానికి వచ్చి ఆ తరువాత బిల్లు పాస్ అవ్వాలి. ఆ బిల్లుపై చెక్కు తయారు చేస్తే దానిపై ఈఓ సంతకం చేసి సంబంధిత మొత్తాన్ని ఆన్‌లైన్‌లో కాంట్రాక్టర్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తే ఆ కాంట్రాక్టర్ 350 మంది సిబ్బంది అకౌంట్లలో జమ చేయాలి. ఇదంతా జరగడానికి కనీసం వారం నుంచి పది రోజుల సమయం పడుతుంది. అంటే ఆగస్టు 20 తేదీ తరువాతనే పారిశుధ్య కార్మికులకు జీతాలు అందే అవకాశం ఉందని అర్థమవుతోంది.



వీరి కష్టం తుడిచేవారేరీ!

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంపై 'సాక్షి'లో మే 26న ప్రచురితమైన కథనం

వాడపల్లి ఆలయానికి బ్యాటరీ కార్లు



వాడపల్లి క్షేత్రానికి వచ్చిన కార్లను పరిశీలిస్తున్న ఈఓ

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రెండు బ్యాటరీ కార్లు అందజేసింది. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం మెర్లపాలెం గ్రామానికి చెందిన జేఎస్ఎన్ రాజు కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు రూ.12 లక్షలు విలువైన రెండు కార్లను అందజేసినట్టు దేవదాయ, ధర్మాదాయ శాఖ డీసీ, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ కార్లను ఈ నెల 15న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభిస్తారని చెప్పారు.

లెఫ్ట్ అయినా రైటే..

- ఎడమ చేతి వాటం జాబితాలో ఎందరో ప్రముఖులు
- కళ, క్రీడ, సంగీత, రాజకీయ రంగాల్లో అద్భుత రాణింపు
- రేపు లెఫ్ట్ హ్యాండర్స్ డే

రాయవరం/బిక్కవోలు: కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్.. అన్నాడో సినీ కవి. కుడి ఎడమైతే గ్రహపాటు కాదోయ్ అంటున్నారు లెఫ్ట్ హ్యాండర్స్. మానవ శరీరంలో గుండె ఎడమ వైపు ఉంటుంది. ఎడమ చేతితో రాసేవారు తమ హృదయ స్పందనను కచ్చితంగా అక్షర బద్ధం చేయగలరని ప్రముఖ విద్యా, మనో వైజ్ఞానిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ వ్యాఖ్యానించారు. ఆయన అభిప్రాయం ప్రకారం.. ప్రపంచంలో ఉన్నత పదవులు అలంకరించిన వారిలో సగానికి పైగా ఎడమ చేతి వాటం వారే. బుధవారం ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా ఈ ప్రత్యేక కథనం.

భిన్నమైన శైలి

సాధారణంగా ఏ పనైనా కుడి చేత్తో చేయడం అలవాటు. ప్రపంచంలో 87 శాతం మంది కుడి చేత్తో పనులు చేస్తుంటే, 12 శాతం మంది ఎడమ చేత్తో చేస్తారని సర్వేల్లో వెల్లడైంది. మిగిలిన ఒక శాతం మంది రెండు చేతులను వినియోగించడంలో సామర్థ్యాన్ని కనబరుస్తారు. దేశంలో 5.20 శాతం మంది మాత్రమే ఎడమ చేతి వాటం కలిగి ఉన్నారు. కుడిచేతి వాటం వారి కన్నా, ఎడమ చేతి వాటం వారు ప్రత్యేక స్థానాల్లో ఉంటారని, వారి మేధోశక్తి, ఆలోచనలు, తెలివితేటలు భిన్నంగా ఉంటాయని నిపుణుల అంచనా. ప్రస్తుతం ప్రపంచంలో గుర్తింపు పొందిన మేధావుల్లో చాలా మంది ఎడమ చేతి వాటం వారు కావడం విశేషం. ప్రతిభ, సృజనాత్మకత, ఏ రంగంలోనైనా రాణించే శక్తి సామర్థ్యాలు ఎడమ చేతి వాటం వారిలోనే ఎక్కువని నాడీ శాస్త్రం కూడా చెబుతుందంటారు. జిల్లా జనాభాలో సుమారు 3.01 లక్షల మంది ఎడమ చేతి వాటం వారున్నట్టు ఓ అంచనా.

ప్రముఖుల్లో కొందరు

ప్రముఖ తత్వవేత్త అరిస్టాటిల్, చంద్రుడిపై మొట్టమొదట కాలుమోపిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, మోనాలిసా సృష్టికర్త లియోనార్డ్ డావెన్సీ, అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, బిల్‌క్లింటన్, ప్రధాని నరేంద్ర మోదీ, పారిశ్రామికవేత్త రతన్‌టాటా, మాజీ క్రికెటర్లు సచిన్ టెండుల్కర్, యువరాజ్‌సింగ్, సినీ నటుల్లో అమితాబ్ బచ్చన్, సావిత్రి ఇలా ఎడమచేతి వాటమున్న ప్రముఖులే. అలాగే పలువురు కళా, క్రీడా, సంగీత రంగాల్లో రాణిస్తూ లెఫ్ట్.. బట్ వియ్ ఆల్వేస్ రైట్ అనిపించుకుంటున్నారు.

ఇబ్బందులూ తప్పవు!

ఎడమ చేతి వాడకంపై లాభనష్టాలు, ఇబ్బందులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎడమచేతి వాటం ఉన్న వారెంతో అదృష్టవంతులని కొందరంటుంటారు. అటువంటి వారు ప్రపంచం గర్వించదగ్గ వ్యక్తులుగా ఎదిగారని చెబుతారు. శుభకార్యాల్లో ఎడమ చేతి వినియోగాన్ని మన సంప్రదాయాలు అంగీకరించవు. ఇటువంటి సందర్భాల్లో ఆ అలవాటు ఉన్నవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూజలు, శుభకార్యాలు, డబ్బు చేతులు మారేటప్పుడు కుడి చేతినే ఉపయోగిస్తారు. పాఠశాలల్లో విద్యార్థుల కుర్చీలకు కుడిచేతివైపు రాయడానికి వీలుగా అట్టలు అమరుస్తారు. డ్రైవర్లకు కుడిచేతి వాటానికి అనుకూలంగా హారన్ వంటివి ఉంటాయి.

జన్యు ప్రభావం కూడా..

పుట్టినప్పటి నుంచే కుడి, ఎడమ చేతి వాటాలను సహజసిద్ధంగా కలిగి ఉంటారని సైన్స్ చెబుతోంది. మనిషికి మెదడు కుడి, ఎడమ రెండు అర్థ భాగాలుగా ఉంటుంది. కుడి వైపు శరీర భాగాన్ని మెదడు ఎడమ వైపు భాగం నియంత్రిస్తుందని, మెదడు కుడి అర్థ భాగం బలంగా ఉన్న వారిలో ఎడమ చేతి వాటం వస్తుందని నిపుణులు చెబుతున్నారు. చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు ఎడమ చేతి వాటం గమనిస్తే.. దానిని మాన్పించేందుకు యత్నిస్తుంటారు. జన్యుపరమైన మార్పులు ఉన్నప్పుడు అలా మాన్పించడం సాధ్యం కాదంటున్నారు.



పందలపాక పాఠశాలలో ఎడమ చేతితో రాస్తున్న విద్యార్థులు

అలవాటుగా మారింది



చిన్నప్పటి నుంచి ఎడమ చేతితో రాయడం అలవాటైంది. ఏ పని చేయాలన్నా ఎడమ చేతితో చేయడం ఈజీగా అనిపిస్తోంది. బలమైన పనులన్నింటికీ ఎడమ చేతినే ఉపయోగిస్తాను. ఓ పని ప్రారంభిస్తే పూర్తయ్యే వరకు ఎడమ చేతితోనే చేస్తాను.

– చింతలపూడి మంగాదేవి, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్, జీహెచ్ఎస్, అనాతవరం

చిన్నప్పటి నుంచి అలవాటు



ఎడమ చేతితో రాయడం, పనులు చేయడం చిన్నప్పటి నుంచి అలవాటు. ఇంట్లో పనులన్నీ ఎక్కువగా ఎడమ చేతితో చేయడం జరుగుతుంది. నాకు ఇద్దరు అబ్బాయిలు. వారికి ఈ అలవాటు రాలేదు.

– సప్పా శాంతి, గృహిణి, కొంకుదురు

మా అమ్మ నుంచి వచ్చింది



ఎడమ చేతిరాత మా అమ్మకి ఉంది. మా అమ్మ నుంచి నాకు, అలాగే నా కూతురికి ఎడమ చేతి అలవాటు వచ్చింది. స్కూల్‌లో నేను డ్రాయింగ్ వేసేవాడిని. బహుమతులూ వచ్చాయి. ఇప్పుడు పెయింట్ వేయడానికి ఉపయోగపడుతోంది.

– కుక్కల శివకృష్ణ, పెయింటర్, పందలపాక

క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్ కోనసీమ జట్టు ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన వెయిట్ లిఫ్టర్లతో కోచ్‌లు, ప్రతినిధులు

అమలాపురం టౌన్: డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో సోమవారం 11 మంది వెయిట్ లిఫ్టర్లు కోనసీమ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. పురుషుల విభాగంలో ఎనిమిది మంది, మహిళా విభాగంలో ముగ్గురిని ఎంపిక చేశారు. వీరు ఈ నెల 14న కాకినాడలో జరిగే జోనల్ స్థాయి, 18న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. పురుషుల విభాగంలో ఇళ్ల మల్లికసాయి, జల్లి జితేంద్ర దొర, కొండేటి వేణుమానస్, బుసకాల యశ్వంత్‌కుమార్, కొల్లి వరుణ్, దాసరి వేదేష్, దొమ్మేటి వేణుసాగర్, వసభక్తుల మణికంఠ, మహిళా విభాగంలో కొండేటి మేఘన, ఉందుర్తి శశికళ, యనమదల ఇందిర ఎంపికయ్యారు. వీరు జిల్లా తరఫున జోనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరు విజేతలుగా నిలిచి జిల్లాకు మంచి గుర్తింపు తేవాలని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి పీఎస్ సురేష్‌కుమార్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, నేషనల్ వెయిట్ లిఫ్టర్ మారే వీరేంద్ర, జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, కోచ్‌లు ఆర్కే నాగేశ్వరరావు, వి.నరేష్, జి.గణేష్‌బాబు, యనమదల పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు


బ్యాడ్మింటన్ పోటీల విజేతలతో నిర్వాహకులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): కాకినాడ సురేష్ నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో జరుగుతున్న ఏపీ, తెలంగాణ సీబీఎస్ఈ క్లస్టర్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. అండర్–14, 17, 19 బాలుర విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, బ్యాడ్మింటన్ సంఘ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం విజేతలకు బహుమతులు అందజేశారు. డైరెక్టర్ విజయప్రకాష్ మాట్లాడుతూ, క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. పోటీల పరిశీలకులు గణేష్, రిఫరీలు పి.శ్రీనివాస్, భద్రం, ప్రిన్సిపాల్ శ్రీదేవి, మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అండర్–14 విభాగంలో మౌంట్‌లిటిరా స్కూల్ బంగారు, ఇండస్ యూనివర్సల్ రజత, సిల్వర్ హోక్స్ కాంస్య పతకాలు సాధించాయి. అండర్–17లో గాడియమ్ స్కూల్ బంగారు, డీపీఎస్ ఆనందపురం రజత, పల్లవి మోడల్ కాంస్య పతకాలు అందుకున్నాయి. అండర్–19లో సిల్వర్ హోక్స్ బంగారు, వికాస్ కాన్సెప్ట్ రతజ, నీలకంఠ విద్యాపీఠం కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాయి.

కలుపు ఉంటే.. కలదు నష్టం

- సాగులో నివారణ అత్యంత కీలకం
- లేకపోతే దిగుబడిపై ప్రతికూల ప్రభావం
- యాజమాన్య పద్ధతులతో అధిక ప్రయోజనాలు
- అవసరం మేరకే మందులు వాడాలంటున్న వ్యవసాయ నిపుణులు


పెదపళ్లలోని వరి పొలంలో కలుపు తీస్తున్న వ్యవసాయ కూలీలు

పాడి-పంట

ఆలమూరు: వరి సాగులో రైతులకు కలుపుతీత ప్రధానమైంది. సకాలంలో కలుపుతీత తీయడం ద్వారా నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులందరూ ఇటీవల ఎక్కువగా వెదజల్లు విధానంలో సాగు చేయడం వల్ల సాధారణంగా కలుపు అధికంగా ఉంటోంది. కలుపును వదిలేస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వరి పంటలో కలుపు నివారించడం ద్వారా నాణ్యమైన పంటలు పండించేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా సాగు చేసే పంటల్లో పెరిగే ఇతర గడ్డి మొక్కలనే కలుపు అంటారు. సాగు భూముల్లో ఈ మొక్కలు ప్రధాన పంట కంటే త్వరితగతిన పెరిగి, పోషకాలను, ఎరువులను స్వీకరించి దిగుబడిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కలుపును నివారించకుంటే తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో పాటు, ఎరువులు, పురుగు మందుల వినియోగం భారీగా పెరిగిపోతుంది. నాణ్యమైన పంటలు పండించడంలో, అధిక దిగుబడులు సాధించడంలో విఫలమయ్యే పరిస్థితులను రైతులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

కలుపు మొక్కలో సాధారణంగా పంటకు ఎక్కువ హాని కలిగించే వాటిల్లో ఊదర, వెడల్పాకు, తుంగ, ఏక వార్షిక గడ్డి జాతులు ఉంటాయి. వీటి నివారణకు సాధ్యమైనంత మేరకు వ్యవసాయ శాఖ సూచనల మేరకు క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తే సత్ఫలితాలు ఉంటాయి. సాధారణంగా రైతులు పొలాల్లో నిర్ణీత సమయంలో కూలీలతో కలుపును తీయించేవారు. కూలీల కొరత ఎక్కువ కావడంతో పాటు, కూలి రేట్లు గణనీయంగా పెరిగిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కలుపు నివారణకు అనేక రసాయన మందులను పిచికారీ చేయిస్తున్నారు. హెర్బిసైడ్ వంటి అనేక మందులు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించకుండా, రసాయన, క్రిమి సంహారక మందులను అధికంగా వినియోగిస్తే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు ఏవిధమైన మందులు, ఎంత మోతాదులో వినియోగించాలో రైతులకు అవగాహన ఉంటే, కలుపును పూర్తిగా నిర్మూలించి, అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

కలుపు నివారణ-అంతర కృషి

వరిసాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కలుపు మొక్కల నివారణకు ప్రత్యేక క్రిమి సంహారక మందులను వినియోగించాలి.

వరి నాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లో ప్రెటిలాకోర్ ద్రావణం 500 మి.లీ. లేదా ఆక్సాడయార్జిల్ 20 గ్రాముల మందును నీటిలో కరిగే గుళికలతో మిశ్రమం చేసి చల్లాలి. పెట్ సల్ఫ్యూరాన్ లేదా క్లోరీ మ్యూరాన్ ఈథేల్ ఎనిమిది గ్రాముల మందును కలుపు రెండు నుంచి నాలుగు ఆకుల దశలో పిచికారీ చేయాలి. కలుపు నాలుగు ఆకుల దశలో ఉన్నప్పుడు బిస్పైరీబాక్ సోడియం లీటరు ద్రావణంలో ఎకరాకు 100 మి.లీ. మందును కలిపి పిచికారీ చేయాలి. పెనాక్సులం లేదా సైహాలోపాస్ బ్యూటైల్ ద్రావణాన్ని 900 మి,లీ. పిచికారీ చేస్తే అన్ని రకాల కలుపు మొక్కలు నిర్మూలించబడతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల కలుపు మందులు లభిస్తున్నాయి. వరి పొలాల్లో పిచికారీ చేసే క్రిమి సంహారక మందును ఎంత మోతాదులో, ఏ సమయంలో, ఎలా వాడాలో అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే వాడాలి. సిఫారసు చేయని, పూర్తి వివరాలు తెలియని కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు. అలా వాడితే కలుపు నిర్మూలన సరిగ్గా జరగకపోగా, కొన్ని సందర్భాల్లో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కలుపు మందును ఇతర సస్యరక్షణ మందులతో కలిపి వినియోగించరాదని, కలుపు నివారణకు ఎల్లప్పుడూ ఒకే మందు వాడరాదని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

యాజమాన్య పద్ధతులు కీలకం



కలుపు నివారణలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. విత్తనం నాటిన నుంచి కలుపు నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకోకపోతే పంట తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది.

– సీహెచ్‌కేవీ చౌదరి, ఏడీఏ, ఆలమూరు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 301 గ్రాముల బంగారం, ఏడు కిలోల వెండి, కారు స్వాధీనం
- మొత్తం రూ.42 లక్షల సొత్తు రికవరీ
- ఎస్పీ నరసింహ కిషోర్ వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు

రాజమహేంద్రవరం రూరల్: చోరీలు, చైన్‌స్నాచింగ్‌తో పాటు, అనేక నేరాలకు పాల్పడిన నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మొత్తం రూ.42 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 301 గ్రాముల బంగారం, ఏడు కిలోల వెండి వస్తువులు, రూ.ఐదు లక్షల విలువైన గృహోపకరణాలు, కారు ఉన్నాయి. ఈ వివరాలను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. కొంతమూరు భవానీపురానికి చెందిన గరిమెళ్ల పవన్ శర్మ గత నెల 15న ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. మళ్లీ 20న ఇంటికి తిరిగిరాగా, ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువా పగులగొట్టిన దొంగలు 18 కాసులు బంగారం, 3.5 కిలోల వెండి వస్తువులు, రూ.10 వేల నగదు దొంగిలించినట్టు గుర్తించారు. ఈ మేరకు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. ఎస్పీ ఆదేశాల మేరకు, నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ పర్యవేక్షణలో రాజానగరం పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్ దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆయనకు అందిన సమాచారంతో కొంతమూరు సంతోష్‌నగర్‌కు చెందిన వేమగిరి హరీష్, మోర్త వెంకటేష్ అలియాస్ వెంకీ, కాకినాడ రూరల్ ఇంద్రపాలెం (ప్రస్తుతం పెరవలి)లో ఉంటున్న తణుకు దుర్గాప్రసాద్ అలియాస్ సూర్యను ఆదివారం రాత్రి 11 గంటలకు అరెస్టు చేశారు. అలాగే తొర్రేడు వెంకటనగరం టిడ్కో ఇళ్ల సముదాయంలో ఉంటున్న బండి ధర్మరాజు అలియాస్ గాబ్రియేల్‌నూ అరెస్టు చేశారు. ఈ కేసులో సొత్తును తాకట్టు పెట్టించిన నిందితులు గున్నూరి అశోక్, రాజేష్‌ను అరెస్టు చేయాల్సి ఉంది. నిందితులు తెలిపిన వివరాలతో 18 కాసుల బంగారం, మూడు కిలోల వెండి, కారును స్వాధీనం చేసుకున్నారు. పాత నేరస్తులైన వేమగిరి హరీష్‌పై 39 కేసులు, మోర్త వెంకటేష్‌పై 34 కేసులు, తణుకు దుర్గాప్రసాద్, బండి ధర్మరాజుపై ఏడు కేసుల వంతున ఉన్నాయి. వీరిని విచారణ చేయగా, 12 హౌస్ బ్రేకింగ్, ఐదు చైన్‌స్నాచింగ్, బైక్ చోరీ, హత్యాయత్నం నేరాలు చేసినట్టు అంగీకరించారు. పలు జిల్లాల్లో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని కేసుల్లో బంగారం, వెండి నగలు, ఏసీలు, మంచాలు, ఫ్రిజ్‌లు, కంచు సామాన్లు, టీవీలను పోలీసులు రికవరీ చేశారు.

అద్దె ఇచ్చేటప్పుడు జాగ్రత్త

జిల్లాలోని ప్రజలు అద్దె వస్తుంది కదా అని ఎవరికి పడితే వారికి ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దని ఎస్పీ నరసింహ కిషోర్ హెచ్చరించారు. ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో వారి కోసం వాకబు చేయాలని సూచించారు. ప్రజలు ఊరికి వెళ్లేటప్పుడు సమీప పోలీస్ స్టేషన్‌లో తెలిపి, ఎల్‌హెచ్‌ఆర్‌ఎస్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడు వేమగిరి హరీష్ ఏడాది నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడని, అతని కోసం విస్తృతంగా గాలిస్తున్నట్టు చెప్పారు. నిందితులను అరెస్టు చేసిన రాజానగరం ఇన్‌స్పెక్టర్ వీరయ్యగౌడ్, ఎస్సైలు ప్రియకుమార్, సత్యనారాయణ, నాగార్జున, క్రైం సిబ్బంది, హెచ్‌సీలు అమ్మిరాజు, సత్యనారాయణ, కరీం, బీవీ రమణ, సురేష్, మురళీని అభినందించారు. రూ.50 వేల ప్రత్యేక రివార్డును అందజేయడంతో పాటు, రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తానని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏఎస్పీ(క్రైం) ఎల్.అర్జున్, నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, రాజానగరం ఇన్‌స్పెక్టర్ వీరయ్యగౌడ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మస్కట్ నుంచి ఇండియా చేరిన బాధితురాలు


మరియమ్మ

అమలాపురం రూరల్: మస్కట్ దేశంలో చిత్రహింసలు పడుతున్న మహిళను కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులు క్షేమంగా ఇండియాకు రప్పించారు. తన భార్యను రప్పించాలని కొత్తపేటకు చెందిన సాక చంటి కలెక్టరేట్‌లో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌లో ఫిర్యాదు చేయగా, కలెక్టర్ ఆదేశాలతో మరియమ్మను ఇండియాకు రప్పించినట్టు డీఆర్‌ఓ, కేంద్ర నోడల్ అధికారి కొత్త మాధవి తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా భర్త, ఇద్దరు బిడ్డలను విడిచి మరియమ్మ విదేశాలకు వెళ్లింది. కోటిపల్లికి చెందిన వ్యక్తి కొంత సొమ్ము తీసుకుని ఈ ఏడాది జూన్ మూడున ఆమెను హైదరాబాద్ నుంచి మస్కట్ దేశానికి విమానం ఎక్కించాడు. అక్కడ పనిచేసే ఇంట్లో ఆమెకు సరైన భోజనం, వసతి కల్పించక, శారీరకంగా, మానసికంగా వేధించారు. దీనిపై ఆమె ఓ వీడియో విడుదల చేసింది. తన ఆరోగ్యం క్షీణిస్తుందని, అక్కడ ఉంటే చనిపోయే అవకాశం ఉందని సారాంశం. వెంటనే ఆమె భర్త చంటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కేసీఎం సిబ్బంది ఆ ఏజెంట్‌ను పిలిపించి, ఇరుపక్షాలను కూర్చోబెట్టి, మరియమ్మ ఇండియాకు రప్పించే ఏర్పాట్లు చేశారు.

అంబులెన్స్ జాప్యంతో వృద్ధుని మృతి


సూర్యనారాయణ (ఫైల్)

గండేపల్లి: అంబులెన్స్ రాక ఆలస్యం కావడంతో నిండు ప్రాణం అనంత వాయువుల్లో కలిసిన వైనమిది. మండలంలోని మల్లేపల్లికి చెందిన ఆలేటి సూర్యనారాయణ (82) సోమవారం ఉదయం అస్వస్థతకు గురయ్యాడు. ఆయన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ రాక ఆలస్యం కావడంతో స్థానికంగా వైద్యుడికి చూపించారు. మెరుగైన చికిత్సకు వెంటనే రాజానగరం జీఎస్ఎల్‌కు తీసుకెళ్లాలని చెప్పడంతో, మరోసారి 108కు సమాచారం అందజేశారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా, అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారు. రెండు గంటల తర్వాత అంబులెన్స్ మరమ్మతులకు గురైందని, గండేపల్లి నుంచి బయలుదేరామని సమాధానం వచ్చింది. అంబులెన్స్ చేరుకునే సరికి సూర్యనారాయణలో చలనం లేదు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. ఆయనను అంబులెన్స్‌లో తరలించేందుకు యత్నించగా, బంధువులు వ్యతిరేకించారు. దీంతో అంబులెన్స్ సిబ్బంది వెనుదిరగాల్సి వచ్చింది.

25 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

రాజానగరం: అనధికారికంగా లారీలో తరలిస్తున్న 25 టన్నుల పీడీఎస్ (రేషన్) బియ్యం సోమవారం పాలచర్ల వద్ద పట్టుబడింది. విజిలెన్స్ అండ్ పౌర సరఫరాల శాఖ సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో నల్లజర్ల నుంచి కాకినాడ పోర్టుకు లారీలో తరలిస్తుండగా, పాలచర్లలోని చెరుకూరి క్రషర్ వద్ద వాహనం పట్టుబడిందని రాజమండ్రి విజిలెన్స్ డీఎస్పీ ఎస్.తాతారావు తెలిపారు. దీని విలువ రూ.11.50 లక్షలు కాగా, లారీతో కలిపి రూ.21.50 లక్షలుగా అంచనా వేశారు. జూలైలో కాకినాడ జేసీ ద్వారా పట్టుకుని, 6ఏ కేసు నమోదైన బియ్యాన్ని విడిపించుకుని తీసుకెళ్తున్నట్టుగా నల్లజర్లకు చెందిన మద్దు సత్యనారాయణ పత్రాలు చూపించాడన్నారు. లారీ డ్రైవర్ వంటపాటి సురేంద్ర నుంచి సేకరించిన వివరాలతో పాటు, వాస్తవాలను పరిశీలించి, జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామన్నారు.

చోరీ సొత్తుతో లారీలు స్వాధీనం

నలుగురి అరెస్టు, పరారీలో ఇద్దరు


స్వాధీనం చేసుకున్న లారీలు, సొత్తుతో పోలీసులు

పిఠాపురం: చోరీకి గురైన లారీల కేసులను పిఠాపురం పోలీసులు ఛేదించారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్ సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల ఐదున రూ.26,83,026 విలువైన సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడ్‌తో లారీని స్థానిక కుంతీమాధవ స్వామి గుడి ముందు ఉంచి, ఉదయం చూడగా చోరీకి గురైందని లారీ యజమాని దగ్గు అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డ్రైవర్స్ కాలనీలో నూకల లోడ్ లారీ చోరీకి గురైనట్టు ఆకుల ప్రసాద్ కూడా మరో ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఆయా కేసులపై ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. సోమవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు యాలంకవారి గరువు వద్ద నిందితులు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. అక్కడ దాడి చేసి పిఠాపురం బొజ్జవారి తోటకు చెందిన బెల్లంకొండ రవితేజ, కోటగుమ్మం సెంటర్‌కు చెందిన నాగిరెడ్డి నాగసతీష్, లయన్స్ క్లబ్ ఏరియాకు చెందిన గంజి సురేష్, కాకినాడ రూరల్ పండూరు, ప్రస్తుతం శంఖవరం మండలం మండపానికి చెందిన నందిపాటి వీరసుబ్రహ్మణ్యాన్ని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి సన్ ఫ్లవర్ ఆయిల్ లోడ్ లారీ, నూకల లోడ్‌తో ఉన్న రెండు లారీలను, రూ.46,83,026 విలువైన 1,380 సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు, రూ.9,66,900 విలువైన 203 కోళ్ల మేత బస్తాలు మొత్తం రూ.56,49,926 విలువైన చోరీ సొత్తులో.. రూ.54,87,926 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. ఇంకా ఇద్దరు పరారీలో ఉన్నారని, వారి నుంచి ఆయిల్ ప్యాకెట్లు రికవరీ చేయాల్సి ఉందన్నారు. పిఠాపురం పట్టణ, కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం రూరల్ ఎస్సైలు మణికుమార్, వెంకటేష్, ఎస్ రామకృష్ణ, జాన్‌బాషా, క్రైం సిబ్బంది పవన్, విష్ణు, వీరబాబు, వినోద్ తదితరులు పాల్గొన్నారు. ఇలాఉండగా, లారీల చోరీల కేసులో పట్టుబడిన వారు జనసేన పార్టీకి చెందిన కార్యకర్తలేనని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి


108 అంబులెన్స్‌లో రాఘవ


గుర్తు తెలియని మృతదేహం

రాజానగరం: వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. గండేపల్లి మండలం కె.గోపాలపురానికి చెందిన జనపరెడ్డి రాఘవ(55) భర్త సత్యనారాయణతో కలిసి మోపెడ్‌పై రాజమహేంద్రవరం వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి అతివేగంతో వచ్చిన హైపవర్ బైక్ వారి మోపెడ్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మోపెడ్ వెనుక కూర్చున్న రాఘవ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. ఆమెను 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే చనిపోయింది. కాగా సత్యనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. కేసును బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కడియం: మండల కేంద్రమైన కడియం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తుంగపాడు గ్రామానికి చెందిన చిక్కిరెడ్డి సరోజిని(28) మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు, సోమవారం ఉదయం కడియం దేవీ సెంటర్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న సరోజినిని టిప్పర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను కడియం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా సరోజిని తన చెల్లెలు సత్యతో కలిసి బ్యాంకులో ఆధార్ అప్‌డేట్ చేయించుకుని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదానికి గురైంది. కడియం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి..

తుని రూరల్: తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి (45) రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు వివరాల మేరకు, సోమవారం రాజమండ్రి నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే రైలు నుంచి యలమంచిలి రైల్వే యార్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తి జారి పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నీలం, నలుపు గడుల ఫుల్‌హ్యాండ్ షర్టు, సిమెంట్ రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడివైపు ఛాతిపై ఐ లవ్ మార్కులో రోహన్ అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వాస్పత్రిలో భద్రపర్చారు. మృతుడిని గుర్తిస్తే 94906 19020 నంబరుకు వివరాలు తెలియజేయాలని ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ముగిసిన అంతర్రాష్ట్ర ఖోఖో పోటీలు


అండర్-19లో ప్రథమ స్థానం పొందిన సిస్టర్స్ నివేదిత స్కూల్ బాలికల జట్టు


అండర్-19లో వెరిటాస్ సైనిక్ స్కూల్ బాలుర జట్టు


అండర్-17లో శ్రీప్రకాష్ బాలికల జట్టు

తుని రూరల్: ప్రతిభ చూపే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ అన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో మూడు రోజుల పాటు జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్–7 అంతర్రాష్ట్ర అండర్–14, 17, 19 బాలబాలికల ఖోఖో పోటీలు సోమవారం ముగిశాయి. విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 180కి పైగా జట్లకు చెందిన రెండు వేల మంది పోటీల్లో పాల్గొన్నారు. మూడు విభాగాల్లో 12 జట్లు విజేతలుగా నిలిచాయి. విజేత జట్లకు మెడల్స్, జ్ఞాపికలు అందించారు. సీబీఎస్ఈ పరిశీలకుడు సీహెచ్ఎల్ఎం శ్రీనివాసు, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, వివిధ ప్రాంతాలకు చెందిన కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఇలా..

అండర్–19 బాలికల విభాగంలో సిస్టర్స్ నివేదిత స్కూల్(హైదరాబాద్), వెరిటాస్ సైనిక్ స్కూల్ (తిరుపతి) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. అలాగే బాలుర విభాగంలో వెరిటాస్ సైనిక్ స్కూల్, ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై(మహబూబ్‌నగర్), అండర్–17 బాలికల విభాగంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ (పాయకరావుపేట), మాంటిస్సోరి ఎలైట్ (అనంతపురం), బాలుర విభాగంలో శ్రీప్రకాష్, ఎకార్డ్ స్కూల్(తిరుపతి), అండర్–14 బాలికల విభాగంలో హీల్ స్కూల్ (నరిసింగపాలెం), సూర్య అకాడమీ(హైదరాబాద్), బాలుర విభాగంలో శ్రీప్రకాష్, ఏకశిల ఇంటర్నేషనల్ (మహబూబ్‌నగర్) విజేతలుగా నిలిచారు.

కాపురం చేస్తూనే.. రెండో పెళ్లికి సిద్ధం

- వివాహ సమయానికి అదృశ్యం
- పోలీసులకు వధువు బంధువుల ఫిర్యాదు


న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్న వధువు బంధువులు

దేవరపల్లి: ఓ మహిళతో కాపురం చేస్తూనే.. పెళ్లి పేరుతో మరో యువతిని మోసం చేసేందుకు యత్నించి, తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. సీఐ బీఎస్ పట్నాయక్ వివరాల మేరకు, గోపాలపురం మండలం భీమోలుకు చెందిన యువతికి, దేవరపల్లి మండలం యాదవోలుకు చెందిన పాలి వీరవెంకట సత్యనారాయణతో ఇటీవల వివాహం కుదిరింది. సోమవారం తెల్లవారుజామున స్థానిక ఫంక్షన్ హాల్‌లో పెళ్లి జరగాల్సి ఉంది. ఆదివారం సాయంత్రం వధువు ఇంటి వద్ద పెళ్లి ఏర్పాట్లు చేశారు. మరో గంటలో పెళ్లిపీటలు ఎక్కాల్సిన వరుడు కనిపించడంలేదంటూ వధువు బంధువులకు రాత్రి ఏడు గంటల సమయంలో సమాచారం వచ్చింది. దీంతో కంగారు పడిన ఆమె బంధువులు అసలు వివరాలు సేకరించారు. అంతకు ముందే సత్యనారాయణకు పెళ్లయి, కాపురం చేస్తున్నాడని, అందుకే పెళ్లికి రాకుండా అదృశ్యమైనట్టు సమాచారం అందింది. దీంతో వధువు కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆమె బంధువులు ఆందోళన చేశారు. సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ పట్నాయక్ తెలిపారు.